క్లుప్తంగా

ఉచిత మెగా వైద్య శిబిరం

మాచవరం: స్థానిక ఎంపీపీ స్కూల్‌లో ముజావర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీదత్త హాస్పిటల్ సహకారంతో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పలు రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. నిర్వాహకులు షరీఫ్ ముజావర్, శ్రీదత్త హాస్పిటల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పిడుగురాళ్ల: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పట్టణంలోని భారత్ పెట్రోల్ బంకు వెనుక ఆటో నగర్‌కు వెళ్లే దారిలో గుర్తించినట్లు పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు శనివారం తెలిపారు. సుమారు మూడు, నాలుగు రోజుల క్రితం మృతి చెంది ఉండ వచ్చునని, అటువైపు వెళ్తున్న వారికి దుర్వాసన రావటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారని చెప్పారు. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా సుమారు 55 నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగి వ్యక్తి మృత దేహం పురుగులు పట్టి ఉందని తెలిపారు. చొక్కా జేబులో నకరికల్లు వద్ద బస్సు ఎక్కి కొండమోడు సమీపంలో దిగినట్లు టికెట్ ఆధారం ఉందన్నారు. మృతదేహంపై తెలుపు, కాఫీ రంగు కలిగిన గళ్ల చొక్కా, బులుగు రంగు లుంగీ ఉందని తెలిపారు. ఆచూకి తెలిసిన వారు తన నంబరుకు 94407 96236, లేదా పట్టణ ఎస్ఐ 80999 10446 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

క్రమశిక్షణతో చదవాలి



దాచేపల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని స్కాలర్స్ ఇంటర్నేషనల్ స్కూల్ గ్రూప్ చైర్మన్ జి. పిచ్చిరెడ్డి అన్నారు. స్థానిక స్కాలర్స్ స్కూల్ వారికోత్సవం శనివారం జరిగింది. చైర్మన్ పిచ్చిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాలు ప్రారంభించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో విద్యార్థులు చక్కగా చదువుకొని విద్యలో రాణించాలని ఆయన కోరారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డైరెక్టర్ జి. శ్రీనివాసరెడ్డి, ఎ. పకీరారెడ్డి, ఎం. జగదీశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఎంఎస్ రంగారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు మోటివేషన్ క్లాసు

వెల్దుర్తి: వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మోటివేటర్ రంగా రత్న శ్రీ కిడ్స్ పాఠశాలలో శనివారం మోటివేషన్ క్లాస్ తీసుకున్నారు. అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల భయం పోగొట్టేందుకు ఇలాంటి క్లాసులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

సీఎం సహాయ నిధి నగదు చెక్కుల పంపిణీ

రూ.12.50లక్షలు అందజేసిన ఎమ్మెల్యే పిన్నెల్లి

వెల్దుర్తి: పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నగదు చెక్కులను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అందజేశారు. దుర్గి మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన గొరెడ్డి ప్రతాపరెడ్డికి రూ. 2.50లక్షలు, సేమికల వెంకట సుజాతకు రూ.లక్ష, మాచర్ల పట్టణంలోని ఎల్పీ కాలనీకి చెందిన కొణతం శ్రీనివాస్‌కు రూ.9లక్షలు లెక్కన ముగ్గురికి రూ. 12.50 లక్షల నగదు చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పీఆర్కే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో ఉన్నారన్నారు. అనారోగ్యానికి గురై బాధపడుతున్న వారికి సహాయం చేయాలని కోరగా పెద్ద మనసుతో నిధులను విడుదల చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొమ్మారెడ్డి చలమారెడ్డి, బాధితులు, బంధువులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ ఆలయంలో పీఆర్కే పూజలు

విజయపురిసౌత్: స్థానిక బయ్యారం సమీపంలో సేవలాల్ కీమాలాల్ జంక్షన్ వద్ద శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయాన్ని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శనివారం సందర్శించారు. ఈ నెల 17న సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే పిన్నెల్లికి ఆలయ ధర్మకర్త కె.పాండు నాయక్ ఆహ్వాన పత్రిక అందజేశారు. పీఆర్కే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. అర్చకులు శ్రీను నాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కేపీ గూడెం సర్పంచ్ పాండు నాయక్, పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బ్రహ్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారికి సీఎంఆర్ఎఫ్ నగదు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పిన్నెల్లి

గ్లోరి ఆఫ్ క్రైస్ట్ చర్చి అభివృద్ధికి కృషి

విజయపురిసౌత్: స్థానిక గ్లోరి ఆఫ్ క్రైస్ట్ చర్చి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం గ్లోరి ఆఫ్ క్రైస్ట్ చర్చి 13వ పరిశుద్ధాత్మక వేడుకల్లో భాగంగా జరిగిన ఉపవాస ప్రార్థనల ముగింపు కూడిక సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ డా.రెవరెండ్ పాస్టర్ దానియేలు ఆధ్వర్యంలో 40 రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టడం అభినందనీయమన్నారు. చర్చి 50 సంఘాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని చెప్పారు. చర్చి ఆవరణలో నూతన చర్చి నిర్మాణానికి పాస్టర్ దానియేలు, సిస్టర్ మహిమా దానియేలు ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. మాచర్ల మున్సిపల్ చైర్మన్ చిన్న ఏసోబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి, మండల నాయకుడు బూడిద శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



వెల్దుర్తి: ఎంపీడీఓగా నరసింహా శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా తర్లుపాడు ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆయన బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జిగా పనిచేసిన డి.ప్రసాద్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

బోర్లతో తాగునీటి సమస్యకు పరిష్కారం

రెంటచింతల: మండలంలోని తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో బోర్లు వేయడం ద్వారా సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంతిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో జెడ్పీ నిధులతో మల్లవరంలో 2, గోలిలో 2, రెంటచింతలలో 2, పాలు వాయిలో 2, మిట్టగుడిపాడు గ్రామంలో ఒక బోరును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాత పాలువాయి గ్రామంలో ఎంపీటీసీ నిధులు రూ. 2.30లక్షల వ్యయంతో ఒక బోరు, మోటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్త పాలువాయి ఒకటి, తుమ్మకోట గ్రామంలో నాలుగు బోర్లు వేసి, మంచినీటి సమస్యకు పరిష్కారం చూపినట్లు తెలిపారు.

పీవీకి భారతరత్న హర్షణీయం



వెల్దుర్తి: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు ప్రభుత్వం భారతరత్న ప్రకటించడంపై మాచర్ల గాయత్రి సేవా సంఘం అధ్యక్షుడు దండెంరాజు హనుమంతరావు హర్షం వ్యక్తం చేశారు. శనివారం పెన్షనర్స్ హాలులో పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. పీవీ నరసింహారావు సరళీకృత ఆర్థిక విధానాల ద్వారా భారతదేశ అభివృద్ధికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. సభ్యులు సాగి వెంకట శివ నాగరాజు, మాదిరాజు బాబు శ్రీనివాసరావు, గంద్రకోట శ్రీనివాసరావు, సాగి వెంకటేశ్వర శాస్త్రి, దివాకరుని ప్రసాద్, సోమరాజు మధు తదితరులున్నారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



కారెంపూడి: విప్రో ఎర్తియన్ అవార్డు – 2024లో కారెంపూడి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ ఎస్.నయోమి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్ఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి విజయవాడలో మెమెంటో, సర్టిఫికెట్స్ విద్యార్థులు మహాలక్ష్మి, భవాని, అరుణ్‌కుమార్, జుబేదా, కౌశిక్‌కు అందజేసినట్లు పేర్కొన్నారు. వేస్ట్ మేనేజ్‌మెంట్ థీమ్ మీద విద్యార్థుల ప్రజెంటేషన్‌కు రాష్ట్రస్థాయిలో రెండవ స్థానం దక్కిందన్నారు. మొత్తం 38 పాఠశాలల విద్యార్థులు పోటీలో పాల్గొన్నారని సైన్స్ టీచర్ ఎ.ప్రసన్నలక్ష్మి తెలిపారు.

అక్రమ మైనింగ్, పేకాట క్లబ్ నడిపించింది యరపతినేని

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అభివృద్ధిపై చర్చకు సవాల్
- విమర్శలను తీవ్రంగా ఖండించిన వైఎస్సార్‌సీపీ నేతలు

దాచేపల్లి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి.. సంక్షేమంపై టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బహిరంగ చర్చకు సిద్ధమా అని వైఎస్సార్ సీపీ నేతలు సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిపై టీడీపీ నేత యరపతినేని చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. ఈ మేరకు.. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొప్పుల సాంబయ్య మాట్లాడుతూ అక్రమ మైనింగ్ చేసి, పేకాట క్లబ్‌లు నడిపించి ఇబ్బందులు పెట్టిన యరపతినేని నాల్గవసారి ఇంటికి పంపించేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కాసు ఆధ్వర్యంలో నియోజకవర్గంలో రూ. 3,471 కోట్ల మేర అభివృద్ధి జరిగిందని చెప్పారు. పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ మాట్లాడుతూ యరపతినేని హాయంలో చెప్పుకోవటానికి ఒక్క మంచి పని లేకపోవటం వల్లే చర్చకు రావటం లేదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ అధికార ప్రతినిధి జంగాల సింగరయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

నాల్గో తరగతి ఉద్యోగ సంఘం మండల కమిటీ ఎన్నిక

పిడుగురాళ్ల: ప్రభుత్వ నాల్గొవ తరగతి ఉద్యోగ సంఘ మండల అధ్యక్షుడిగా ఎస్.ఓబులును సంఘ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాల్గొవ తరగతి ఉద్యోగ సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ఎస్.కొండయ్య హాజరయ్యారు. వారి అధ్యక్షతన పిడుగురాళ్ల అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా ఎస్. ఓబులు, ఎస్. మోహిదీన్, జి.నరసింహారావు, సంయుక్త కార్యదర్శిగా ఎం. ప్రసాదరావు, కోశాధికారులుగా కె. రాజారావు, డి. అన్నపూర్ణ, ఇ.శివన్నారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ఓబులును సన్మానిస్తున్న సంఘం నాయకులు

నేడు వాసవీ మాత ఆత్మార్పణ వేడుకలు

రెంటచింతల: స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాలను ఆదివారం నిర్వహించనున్నట్లు దేవస్థానం అధ్యక్షుడు కట్టమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సుప్రభాత సేవ, ఆర్యవైశ్య పతాకావిష్కరణ, 102 మంది కన్యలతో గణపతి పూజ, అభిషేకం, హోమం, కుంకుమ పూజ, ఆర్యవైశ్య దంపతులతో గణపతి పూజ, పుణ్యాహవచనం, అమ్మవారికి పంచా మృతాభిషేకం, సహస్రనామ పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం భగవద్గీతపారాయణం, విష్ణు లలితా సహస్ర నామ పారాయణం, అమ్మవారి ఊరేగింపు ఉంటాయని చెప్పారు. ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని, వాసవి అమ్మవారి దివ్యాశీస్సులు పొందాలని ఆయన కోరారు. దేవస్థానం పాలకవర్గ సభ్యులు నాళం చిన బాబు, పల్చూరి శివరామకృష్ణ, దేవరశెట్టి వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ తిరుపతమ్మ తిరునాళ్ల

దాచేపల్లి : గామాలపాడులో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యస్వామి తిరునాళ్ల మహోత్సవం శనివారం జరిగింది. ఆలయ పూజారి శ్రీనివాసరావు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ గావించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలు నిర్వహించారు. సర్పంచ్ జంగా సురేష్, పిడుగురాళ్ల జెడ్పీటీసీ జంగా వెంకటకోటయ్య, ఎంపీటీసీ షేక్ ఆదాం సాహెబ్, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ చాప శేషయ్య తదితరులు అమ్మవారి దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

గురజాల: ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు ఎస్.బ్రహ్మం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక చల్లగుండ్ల గార్డెన్స్‌లో ఉదయం 10 గంటల నుంచి వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. క్యాన్సర్, ఆర్థోపెడిక్, న్యూరాలజీ, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, గుండె సంబంధిత పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు.